# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## 3 గంటలతో మూల కూడా పారదు



తాండూర్, నవంబర్ 29 : 3 గంటల కరెంట్‌తో ఎకరం పొలంలో ఒక్క మూల కూడా పారదు. 3 గంటల కరెంట్‌తో ఎన్ని ఎకరాలు పారిస్తరో.. ఎన్ని పుట్లు పండిస్తరో.. రేవంత్‌రెడ్డి చెప్పాలి. అసలు తెలివి ఉండి మాట్లాడుతున్నడా ? అసలు వ్యవసాయం మీద అవగాహన ఉన్నదా. ? 10 హెచ్‌పీ మోటర్లతో గంటలో బావిలో నీళ్లు అయిపోయి మోటర్లు కాలిపోతే, పంటలు ఎండిపోతే ఈ కాంగ్రెసోళ్లు బాధ్యత వహిస్తరా? గాళ్ల పాలనలో పంటలు పండించలేక ఊరు ఇడిసిపెట్టి పోయినోళ్లున్నరు. గదే తెలంగాణ వచ్చి కేసీఆర్ సీఎం అయినంక తిరిగి వచ్చి మంచిగ ఎవుసం చేసుకుంటున్నరు.

**- ఓరగంటి శివయ్య, రైతు, ద్వారకాపూర్ గ్రామం, తాండూర్ మండలం**

## 24 గంటల కరెంట్‌తో రంది లేకుండా



తాండూర్, నవంబర్ 29 : వ్యవసాయానికి సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రంది లేకుండా ఎవుసం చేసుకుంటున్నం. కాంగ్రెస్ నేతలు మాత్రం 3 గంటల కరెంట్ చాలని చెబుతున్నరు. గట్లయితే ఎవుసం ఎట్లా సాగుతది. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. ఎలాంటి రంది లేకుండా పంటలు పండించుకుంటున్నం. ఎప్పుడంటే అప్పుడు నీళ్లు పెట్టుకొని పొలాలు పారిచ్చుకుంటున్నం. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడం మాతో కాని పని. ఖర్చు కూడా పెరుగుతది. కరెంట్ సమస్య కూడా వస్తది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ కష్టాలు తప్పవు. అందుకే వాళ్లను అధికారంలోకి తెచ్చే ప్రసక్తి లేదు. సీఎం కేసీఆర్‌కే మా ఓటు.

**-కోయ దుర్గయ్య, రైతు, కత్తెర్ల గ్రామం, తాండూర్ మండలం**

## రైతుల బాధలు తెలియని కాంగ్రెస్‌కు ఓటెయ్యద్దు..



లక్షెట్టిపేట, నవంబర్ 29 : వ్యవసాయానికి సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చుడుతోనే రైతులకు ఏబాధ లేకుండా ఉంటున్నరు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని చెబుతున్నారు కానీ పంటలు పండవు. కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మితే రైతులకు కష్టాలు తప్పవు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం సాగు చేసుకునేందుకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వడంతో రోజులో ఏ సమయంలో పొలానికి పోయినా కరెంట్ ఉండడం చేత మోటర్ చాలు చేసుకొని కావాల్సినన్ని నీళ్లు పారిస్తున్నం. కాంగ్రెస్ వాళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడం రైతులకు ఖర్చులు పెరగడం ఖాయం. 10 హెచ్‌పీ మోటర్లనీ ఒకేసారి స్టార్ట్ చేస్తే కరెంట్ సమస్యలు వస్తాయి. వ్యవసాయంపై అవగాహన లేని కాంగ్రెస్ వాళ్లకు ఓటు వేయద్దు.. వారిని అధికారంలోకి రానివద్దు. రైతులమంతా బీఆర్‌ఎస్ పక్షానే ఉంటాం.. కారు గుర్తుకే ఓటు వేస్తాం.

**-మైదం భూమయ్య, రైతు, రంగపేట గ్రామం, లక్షెట్టిపేట మండలం**



## కాంగ్రెస్ వస్తే కరెంటుకు కష్టాలే

చెన్నూర్ టౌన్, నవంబర్ 29 : మా ఊరిలో పది ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న. మూడు గంటల కరెంటుతో ఎకరం పొలం కూడా తడ్వదు. ఎవుసం చేసేటోళ్లకయితే ఎంతసేపు కరెంటుండాలో తెలుస్తది. ఇప్పుడు 24 గంటల కరెంటుతో ఇబ్బందిలేకుండా ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటుకు అరిగోస పడ్డం. ఎప్పుడుంటదో, ఎప్పుడుపోతదో తెల్వక మస్తు తిప్పలువడ్డం. రాత్రిపూట కరెంటు పెట్టేందుకు పోయి పాములు, తేళ్లు, విషపు కీటకాలు కుట్టి ఎంతోమంది రైతులు చనిపోయిన్రు. కాంగ్రెస్ పాలన వస్తే మళ్లీ కరెంటు కష్టాలే వస్తయి. ఇప్పుడు కేసీఆర్ సర్కారులో రందిలేదు. రాత్రిపూట పొలంకాడికి పోనవరంలేకుండా పగటిపూటే పొలం పనులు చేసుకుంటున్నం. రైతుల కష్టం తెలిసిన కేసీఆరే మళ్లీ అధికారంలోకి రావాలె. బీఆర్‌ఎస్ సర్కారైతే రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నది.

**- సాయని రాజేశ్, రైతు, చెన్నూర్**

# కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

- **ధరణి రద్దు చేస్తే పాత రోజులు వస్తాయని రైతుల ఆందోళన**
- **కాంగ్రెస్ పాలనలో కష్టాలు అన్నీ ఇన్నీ కావు**

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ కోసం ముప్పు తిప్పలు పడ్డామని, ప్రత్యక్ష నరకం చూపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతి కొచ్చే దశలో ఎండిపోయేవని, కరెంటో రామచంద్రా అని పాలకులను వేడుకున్నా కనికరించ లేదని మండిపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో రంది లేకుండా పంటలు పండిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు 3 గంటలు కరెంట్ సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వినియోగించుకోవాలని సలహాలు ఇస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయ కులు ఎన్నికల సమయంలో రైతులకు మాయ మాటలు చెప్పి మభ్య పెట్టే ప్రయ త్నాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్‌ను బొందపెట్టాలని రైతులు భగ్గు మంటున్నారు. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రెవెన్యూ కార్యాలయాల చుట్టూప్రదక్షిణలు తప్ప వంటున్నారు. పాత పద్ధతిని తీసుకొచ్చి దళారీ వ్యవస్థను ప్రోత్సహించేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు.

## ధరణి వచ్చాక దళారుల దందా బంద్ అయింది..



లక్షెట్టిపేట, నవంబర్ 29 : తెలంగాణ రాష్ట్రం వచ్చినంక తహసీల్ కార్యాలయాల ముందు దళారులు అనేటోడు కనిపించకుండా పోయిండు. రైతులు భూములు కొనుగోలు చేసుకోవాలన్నా అమ్మకాలు నిర్వహించాలన్నా ఇక నేరుగా ఆఫీస్‌కు పోయి సారును కలిసి వేలిముద్ర వేసి చేసుకునుడే అయితంది. గతంలో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీ వాళ్లు పాలించినప్పుడు మ్యాన్యువల్ పద్ధతిలో రికార్డులను రాస్తూ పట్వారీలు రైతులను అరిగోస పెట్టెటోళ్లు. భూమి ఒకరి పేరు మీద ఉండేది కాస్తుకు మరొకరి పేరు ఉండేది చేసేటోడు ఇంకొకడు ఉండేటోడు. ఇవన్నింటిని సవరించుకోవాలంటే పట్వారి, వీఆర్వో దగ్గరికి ఒక దళారిని తీసుకుపోయి సరి చేయాల్సి ఉండేది. దళారితో అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ వచ్చినంక ధరణి పోర్టల్ అనేది తెచ్చి రైతుల భూమికి భద్రత తీసుకువచ్చిండు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరణి తీసేత్తం అని ప్రచారం చేస్తుండ్రు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల భూములు గుంజుకోవాలని కన్నేసిండ్రు. సీఎం కేసీఆర్ ఉన్నంత కాలం రైతులు కారు గుర్తుకే ఓటేస్తరు. **-మారం బాలయ్య, రైతు రంగపేట గ్రామం, లక్షెట్టిపేట మండలం**

## గోసపడ్డది చాలు



నెన్నెల, నవంబర్ 29 : ధరణితోనే రైతులకు న్యాయం జరుగుతుంది. ఏదో మా భూమి.. మీ భూమి అంటూ చెప్పే వారిని నమ్మేటట్లు లేదు. మోసం చేసేవారు ఏదో చెప్పి కాలం వెళ్లదీస్తరు తప్పా రైతుల గోస పట్టించుకోరు. ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలను అసలే నమ్మే పరిస్థితి లేదు. రైతులు పడుతున్న తిప్పలు వాళ్లకేం తెలుసు. కాంగ్రెస్ కాలంలో ఎంత గోసపడ్డమో గా నాయకులకు తెల్వదా. ధరణి తీసివేస్తే రైతుల బతుకులు ఆగమవుతయి.. గాళ్ల మాటలు ఎవరూ నమ్మరు. గా ప్రభుత్వం ఉన్నప్పుడు గట్లనే పట్వారీలతో నానా గోస పడ్డం. భూమి పట్టా చేసుకోవాలన్నా.. పహాణీలో పేరు మారాలన్న పైసలిస్తేనే పనయ్యేది. ఇప్పుడు మళ్లీ గట్లనే చేయాలని కుట్ర చేస్తున్నరు. ధరణిలాంటి పోర్టల్ పెట్టి మంచి చేసినోడు ఎక్కడున్నడో కాంగ్రెసోళ్లు చూపెట్టాలి.

**- మానపెల్లి మధనయ్య, రైతు, ఖర్జీ గ్రామం, నెన్నెల మండలం**

## భూముల భద్రతకే 'ధరణి'



తాండూర్, నవంబర్ 29 :రైతుల భూములు భద్రంగా ఉండాలని కేసీఆర్ సర్కారు ధరణి తెచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణి తీసేసి పాత పద్ధతిని కొనసాగిస్తదట. ఇది దుర్మార్గపు చర్య. రైతుల భూములకు తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ పూర్తి భద్రత కల్పిస్తే, వాటిని రద్దు చేస్తే మళ్లీ అరిగోస తప్పదు. ధరణి రద్దు చేస్తే దరిద్రం చుట్టుకున్నట్టే. ధరణి రాకముందు ఎన్నో ఇబ్బందులు పడ్డం. అవన్నీ ఇప్పటికీ మర్చిపోతలేం. పట్వారీ, వీఆర్వోలు ఒకరి భూమి ఒకరి పేర రాసి కోట్లు గడించిన్రు. ఎకరం భూమి పట్టా కావాలంటే ఏళ్లు పట్టేది. భూముల గొడవలు ప్రతి గ్రామంలో ఎన్నో జరిగేవి. రైతుల బాధలు చూసిన కేసీఆర్ ధరణి తెచ్చిండు. ఇప్పుడు ఏ రందీ లేదు. రిజిస్ట్రేషన్ చేయాలంటే క్షణాల్లో పని అయిపోతుంది. నిమిషాల్లో పట్టామారి, వెంటనే హక్కు పత్రం ఇస్తున్నారు. ఎవ్వరినీ ప్రాధేయ పడకుండా తహసీల్ కార్యాలయంలోనే ఈ పనులన్నీ అయిపోతున్నయ్. గంటలో ఇంటికి వెళ్లిపోవచ్చు. అప్పుడయితే ఏండ్లు పట్టేది. ధరణి పెట్టిన బీఆర్‌ఎస్‌కే మా మద్దతు. ధరణి రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్‌కు ఓటు ద్వారా బుద్ధి చెప్తాం. **- నందిపేట ఇస్తారి, బోయపల్లి గ్రామం, తాండూర్ మండలం**

## కాంగ్రెస్‌కు కరెంట్ ఇచ్చే సత్తా లేదు..



దండేపల్లి, నవంబర్ 29 : కాంగ్రెస్ నాయకులకు కరెంట్ ఇచ్చే సత్తా లేదు. రైతులపై వారికి నిజంగా ప్రేమ ఉంటే వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇయ్యలే. తెలంగాణ వస్తే చీకటైతది అని అప్పట్లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి చెప్పాడు. కనీసం రైతుల ఇబ్బందులను చూసి కరెంట్ ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేదు వాళ్లు. కేసీఆర్ సారు ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నడు. ఇప్పుడైతే రైతులకు కరెంట్ సమస్య లేదు. మూడు గంటల కరెంట్ అని ముందుకు వస్తున్న వాళ్లను మనం నమ్మవద్దు. మంచి పాలన చేస్తున్న కేసీఆర్‌ను చూసి వాళ్లు ఓర్వడం లేదు. ఇయ్యడం చేతకాదు వాళ్లకు ఇచ్చే వాళ్లను ఇయ్యనియ్యరు. రైతులు ఆలోచించి ఓటు వెయ్యాలే. మంచి చేసినోన్ని మరిచిపోవద్దు.

**-మెండే మల్లేశ్, రైతు, నంబాల గ్రామం, దండేపల్లి మండలం**

## ధరణితోనే రైతులకు ధైర్యం...

తాండూర్, నవంబర్ 29 : ధరణి తెచ్చిన తర్వాత రైతులకు మరింత ధైర్యం లభించింది. అన్నింటికీ పరిష్కారం దొరికింది. భూములకు భద్రత ఉన్నది. గతంలో రిజిస్ట్రేషన్ కావాలంటే ఆసిఫాబాద్, మంచిర్యాలకు పోయేటోళ్లం. పొద్దున పోతే వచ్చే వరకు రాత్రి అయ్యేది. ఇప్పుడు మండలాఫీసులోనే రిజిస్ట్రేషన్ అయిపోతున్నది. వెంటనే పట్టా బుక్కు చేతికి ఇస్తున్నరు. ధరణిని తీసేస్తే మళ్లీ దోపిడీకి గురవుతాం. పటేల్, పట్వారీ వ్యవస్థ మళ్లీ రాజ్యమేలుతున్నది. ఒకరి పేరు మీద ఉన్న భూమి ఇంకొకరి పేరు మీదకి సులువుగా మారి పోతుంది. రైతులను ముప్పు తిప్పలు పెడుతరు. భూ సమస్యలపై అధికారులను కలిస్తే వేలకు వేలు ముడుపులు తీసుకునేటోళ్లు. పనిమాత్రం నెలల తరబడి తిరిగిన చెయ్యకపోదురు. సీఎం కేసీఆర్ సార్ రైతుల కోసం ధరణి పోర్టల్ తెచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్నే మళ్లీ ఎన్నుకుందాం.

**-అన్నమనేని సుధాకర్‌రావు, రైతు, తాండూర్**

